ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 11 సెప్టెంబరు 2025





సున్నా వడ్డీ కలేనా?



స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి పొందే మహిళలపై రుణాల వడ్డీ భారం తప్పడం లేదు. రాయితీతో తమపై భారం తగ్గుతుందని ఆశించిన వారికి.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వడ్డీ మోత తప్పడం లేదు. ఎన్నికల హామీ మేరకు.. ప్రభుత్వం కొలువు దీరి 15 నెలలైనా.. ఇంత వరకు 'సున్నా వడ్డీ' ఊసే లేదు. బడ్జెట్ కేటాయింపుతో హడావుడి చేసినా.. ఆచరణ శూన్యం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం సున్నా వడ్డీపై పిల్లి మొగ్గలు వేసి.. చివరి విడత వడ్డీ డబ్బులు చెల్లించలేదు.



- డ్వాక్రా సంఘాలకు తప్పని భారం
- పరిమితి తగ్గించిన గత ప్రభుత్వం
- 'ఆసరా'లోనూ మహిళలకు టోకరా..!
- కూటమి ప్రభుత్వంలో ఊసేలేని రాయితీ హామీ అమలు..

బాపట్ల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 74,640 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో ఏడు లక్షల మంది మహిళలు ఉన్నారు. బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్‌ను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య ఎనిమిది లక్షలకు పెరుగుతుంది. వీరు ఏటా స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.3 వేల కోట్ల మేర రుణాలు తీసుకుంటుంటారు. ఆయా కేటగిరీలను బట్టి 9 నుంచి 13.5 శాతం వరకూ వీరు బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏటా మూడు జిల్లాల్లో వీరిపై దాదాపు రూ.125 కోట్ల మేర వడ్డీ భారం పడుతోంది.

ఎన్నికల హామీ అమలుకు నోచుకునేనా?

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయం సహాయక సంఘాల మహిళలపై వడ్డీ భారం తగ్గిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల హామీ ఇచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పరిమితిని రూ.3 లక్షలకే పరిమితం చేసి మోసం చేసిందని, తాము రూ.10 లక్షలకు పెంచుతామని అట్టహాసంగా ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు పూర్తయింది. కానీ, మహిళలకు ఇచ్చిన సున్నా వడ్డీ హామీ మాత్రం అమలుకు నోచుకోలేదు.

● 'ఆసరా'లోనూ టోకరా..

2019 ఏప్రిల్ 11 నాటికంటే ముందు చెల్లించిన రుణాలకు కూడా వడ్డీని రీయింబర్సు చేస్తామని అప్పట్లో వైసీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక 'ఆసరా' పేరుతో నాలుగు విడతలుగా ఆ వడ్డీని తిరిగి (మిగతా 7వ పేజీలో)

గతంలో వంచించిన వైసీపీ ప్రభుత్వం..

వైఎస్సార్ సున్నా వడ్డీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం మహిళలకు వడ్డీ రాయితీ ఇస్తానని చెప్పింది. ఆచరణలో మహిళలను ఘోరంగా వంచించింది. 2014-19 మధ్య కాలంలో గ్రూపు రుణం రూ.5 లక్షల వరకూ వడ్డీ రాయితీ ఇవ్వగా, వైసీపీ సర్కార్ 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పేరుతో దాన్ని రూ.3 లక్షలకు పరిమితం చేసింది. దానికి కూడా అనేక షరతులు పెట్టింది. దీంతో అన్ని డ్వాక్రా సంఘాలు అంతకు ముందు ప్రభుత్వంలో కంటే అదనంగా వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. రూ.5 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న చాలా సంఘాలు సున్నా వడ్డీకి దూరం కావాల్సి వచ్చింది. ఫలితంగా మూడు జిల్లాల మహిళలపై రూ.110 కోట్ల వడ్డీ భారం పడింది.

పొగాకు కొనుగోళ్లలో గందరగోళం

- కారంచేడు రైతులకు తెనాలి షెడ్యూల్
- మార్క్‌ఫెడ్ అధికారుల వైఖరిపై నిరసన
- కొనకపోతే మీరే తగలబెట్టండని ఆగ్రహం

తెనాలి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యుల్ ప్రకారం వచ్చే రైతుల నుంచి ఒక్క ఆకు కూడా మిగలకుండా కొంటామని ప్రభుత్వం చెబుతుంది. కానీ మార్క్‌ఫెడ్ అధికారులు తీరు మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. కారంచేడు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో పొగాకు పండించిన రైతులకు వారి సరకు అమ్ముకునే అవకాశాన్ని తెనాలి మార్కెట్ యార్డుకు షెడ్యుల్ ఇచ్చారు. నాలుగు రోజులుగా పొగాకు బేళ్ల తీసుకొస్తుంటే, కొంతవరకు కొనుగోలు చేస్తున్నారని, చాలావరకు వంకలు పెడుతున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కారంచేడు రైతులు తెనాలి యార్డులో తమ సరకు కొనుగోలు చెయ్యాలంటూ నిరసనకు దిగారు. కొనకపోతే మీరే తగలబెట్టేయండంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ అధికారులు కాకుండా, బయటివారు సరకు నాణ్యతను నిర్ధారిస్తున్నారని, వారికి ఇష్టమొచ్చిన వాటిని, సిఫార్సులున్న వాటిని కొంటున్నారని, లేనివారివి అసలు పట్టించుకోవడం లేదనేది రైతుల ఆరోపణ. నాసిరకంగా ఉన్నా క్వింటాకు రూ.6 వేలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినా మార్క్‌ఫెడ్ అధికారులు అవేమీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత అధికారులు సరుకు పరీక్షించిన తర్వాతే ఎప్పుడు, ఏ కొనుగోలు కేంద్రానికి వెళ్లాలనేది నిర్ణయించి, షెడ్యూల్ ఇస్తున్నారని, దీంతో రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు చేసుకుని వస్తే అధికారులు తిప్పి పంపుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. పండించిన పంటకు రూపాయి రాకపోగా, మళ్లీ తిరిగి వెనక్కు తీసుకువెళ్లడానికి రెట్టింపు ఖర్చుపెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ ఎక్కువగా ఉన్న సరకు తీసుకొస్తున్నారని, పది రోజుల క్రితం అవగాహన కల్పించినా, వారు పాటించకుండా వస్తున్నారని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద పొగాకు కొనుగోలుకు సంబంధించి గందరగోళ వాతావరణం నెలకొంది.

కొనమని చెప్పడం లేదు

పొగాకు కొనుగోళ్లలో నాణ్యత నిర్ధారణకు ఐటీసీ సహకారం తీసుకున్నాం. వారు పరీక్షించి క్వాలిటీ నిర్ణయిస్తున్నారు. పైగా కొనలేమని ఎవరికీ చెప్పడం కానీ, తిప్పిపంపడం కానీ చేయడంలేదు. సరకు నాణ్యత లేకున్నా, తేమ శాతం ఎక్కువగా ఉన్నా, వాటిని కొని గోదాములో మంచి సరుకుతోపాటు నిల్వ ఉంచితే, వాటికి ఫంగస్ సోకుతుంది. దీని వల్ల మొత్తం పొగాకు నాశనమైపోతుంది. అందుకే తేమ తగ్గేవరకు ఆగి, తర్వాతే తీసుకురమ్మంటున్నాం.

- కరుణ, డీఎం, మార్క్‌ఫెడ్, బాపట్ల జిల్లా



కొనుగోలు చేయడం లేదంటూ ఆందోళన చేస్తున్నరైతులు

సమర్ధవంతంగా స్త్రీశక్తి అమలు

మరికొన్ని బస్సుల్లో అమలుపై ఆలోచన ● ఎండీ ద్వారకా తిరుమలరావు

అద్దంకి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం(స్త్రీశక్తి పథకం) పక్క రాష్ట్రంలో కంటే మన రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు జరుగుతుందని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజ్‌లో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు,



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎండీ ద్వారకాతిరుమలరావు

మహిళా ప్రయాణికుల సహకారంతో స్త్రీశక్తి పథకం ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 60 డిపోలలో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) వచ్చిందన్నారు. కొన్ని డిపోలలో అయితే 120 శాతం ఓఆర్ కూడా వచ్చిందన్నారు. మహిళా ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ వస్తుందన్నారు. కొన్ని సందర్భాలలో ఆధార్ కార్డు లేకపోయినా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని, దాని కోసం పట్టుబట్టాల్సిన అవసరం లేదన్నారు. ఒకరిద్దరు ఇతర రాష్ట్రాల ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించినంత మాత్రాన పెద్దగా వచ్చే నష్టమేమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణానికి అనుమతించే ఆలోచన చేస్తుందన్నారు. ఎక్కువ మంది మహిళా ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఉందన్నారు.



● నాయుడమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆర్థికవేత్త నాగరాజు, శాస్త్రవేత్త స్వర్ణ వికాంత్

గ్రామీణ ఆర్థిక వికాసంతోనే.. సుసంపన్న భారత్

- ఇందుకు విప్లవాత్మక ఆర్థిక సంస్కరణలు తీసుకొస్తున్నాం
- యూపీఐ దేశ ఆర్థిక లావాదేవీల విధానాన్నే మార్చింది
- ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి మన ఆర్థిక విధానాలు
- భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగరాజు
- సమాజ శ్రేయస్సు కోరిన నిజమైన శాస్త్రవేత్త నాయుడమ్మ
- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- నాగరాజుకు నాయుడమ్మ పురస్కారం ప్రదానం

7

పరిశీలన ప్రహసనం

- కొలిక్కిరాని డీఎస్సీ సర్టిఫికెట్ల సమస్యలు
- కత్తి మీద సాములా ఈడబ్ల్యూఎస్ అర్హత గుర్తింపు
- దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల్లో రోజుకో కొత్త సమస్య

గుంటూరు(విద్య), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్లలో వాస్తవమెంత.. దివ్యాంగుల ధ్రువీకరణలో అర్హత ఉందా.. వివాహమైనా భర్తల ప్రస్తావన లేకుండా తల్లిదండ్రుల ఆశ్రయంలో ఉన్నట్లు కొందరు దరఖాస్తులో చూపడం.. ఇలా అనేక సమస్యలతో మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఇంకా కొలిక్కిరాలేదు. ఒక సమస్య పరిష్కారం అయితే మరో సమస్య ఉత్పన్నం కావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల విషయంలో నెలకొన్న సమస్యలను అధికారులు క్రమంగా పరిష్కరించుకుంటూ వస్తుండగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) అభ్యర్థుల విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయి. దీంతో అధికారులు వీటిపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో విచారించిన తర్వాతనే ఈడబ్ల్యూఎస్‌కు అర్హత నిర్ధారిస్తున్నారు. మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమై ఇప్పటికే 10 రోజులు గడిచింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో దాదాపు 1600 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. వందమందికి పైగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వివిధ దశల్లో ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే సర్టిఫికెట్లలో అర్హతలకు సంబంధించి అనేక సమస్యలను అధికారులు గుర్తించారు. ఆయా సర్టిఫికెట్ల పరిశీలనలో సమస్యలు కొలిక్కి రాకపోవడంతో అధికారులు నిత్యం ఈ పనిలో తల మునకలవుతున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి అర్హులను ఎంపిక చేసే ప్రక్రియ అధికారులకు కత్తిమీదసాములా మారింది. దాదాపు 23కి పైగా బృందాలు సర్టిఫికెట్ల పరిశీలనలో నిమగ్నమయ్యారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా రాష్ట్రస్థాయిలో సమస్యలు వస్తాయని అత్యంత ఖచ్చితత్వంతో పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 17 లోగా పరిశీలన ప్రక్రియను ముగించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఈడబ్ల్యూఎస్ అర్హతపై అనుమానాలు..

మెగా డీఎస్సీలో కొంతమంది మహిళా అభ్యర్థులు భర్తలు ఉద్యోగం చేస్తున్నా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పెట్టినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఇటువంటివారు కనీసం పదిమందికిపైగా ఉన్నట్లు సమాచారం. మహిళలకు వివాహం కాకుండా ఉన్నప్పుడే తల్లిదండ్రులకు సంబంధించిన ఈడబ్ల్యూఎస్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఇద్దరు మహిళల భర్తల్లో ఒకరు కానిస్టేబుల్ కాగా, మరొకరు సచివాలయ ఉద్యోగి. వారి భర్తల వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపే కావడంతో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద సదరు మహిళలని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మరికొంత మహిళలు తమ భర్తలు వ్యాపారాలు చేస్తూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో డీఎస్సీకి అర్హత సాధించారు. అయితే వారి భర్తలు ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే వీరు (మిగతా 7వ పేజీలో)



డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొన్న అభ్యర్థులు

కాంట్రాక్టర్ల టోకరా

- నిధులు దోచుకుని నిర్మాణాలు మరిచారు
- 29,168 ఇళ్లకు 30 శాతం కూడా పూర్తికాని వైనం

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్నకాలనీల కాంట్రాక్టర్లు నిధుల దోపిడీతో సరిపెట్టారు. గతంలో అధికార పార్టీ అండదండలతో ఇబ్బడి ముబ్బడిగా గృహ నిర్మాణాలకు సంబంధించిన కాంట్రాక్టులను చేజిక్కించుకున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.30 వేలు లబ్ధిదారులకు మంజూరు చేసింది. ఈ ప్రకారం జిల్లా వ్యాప్తంగా జగనన్నకాలనీల్లోని లేఅవుట్లలో 29,168 నివాసాలు మంజూరు జరిగాయి. చీరాల నియోజకవర్గంలో 3502, అద్దంకిలో 6668, రేపల్లెలో 2462, బాపట్లలో 3948, పర్చూరులో 3422, వేమూరు నియోజకవర్గంలో 9166 ఇళ్ల మంజూరు జరిగాయి. అయితే లబ్ధిదారులు అప్పటి పాలకుల మాటలు విని కాంట్రాక్టర్లకు ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. అయితే ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని దాదాపుగా మూడు దశలకు సంబంధించిన నగదు దాదాపుగా ఒక్కో ఇంటికి రూ.1.20 లక్షలు వరకు దోచుకున్న కాంట్రాక్టర్లు లబ్ధిదారులకు అడ్డం తిరిగారు. చేపట్టిన నిర్మాణాల్లో దాదాపుగా 30 శాతం వరకే పూర్తి జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అసలే చాలీచాలని నగదుతో ఇల్లు ఎలా పూర్తి చేసుకోవాలో అంతు చిక్కని లబ్ధిదారులను కాంట్రాక్టర్లు టోకరా పెట్టడంతో ఇప్పుడు అయోమయంలో ఉన్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇళ్ల అర్థాంతరంగా ఆగిపోయి కనిపిస్తున్నాయి. పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా మంజూరు చేసిన రూ.50 వేలు కూడా చాలా చోట్ల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతో అధికారులు రంగంలోకి దిగారు. దీంతో తమ దోపిడీ ఎక్కడ బహిర్గతమవుతుందోనని పలువురు కాంట్రాక్టర్లు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.



చీరాల జగనన్న కాలనీ

బాపట్లకు నేడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

- ఉపముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- సూర్యలంక రోడ్డులోని నగరవనం ముస్తాబు
- తీర ప్రాంత రక్షణకు గ్రీన్‌వాల్ ఏర్పాటుకు ప్రణాళికలు
- అమరులైన 23 మంది అటవీ అధికారుల కుటుంబీకులతో భేటీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన, జనసేన నేతలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జాతీయ అటవీ అమరవీరుల దినం సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం బాపట్లలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్‌కల్యాణ్ తొలిసారి బాపట్లకు రానుండడంతో అధికారులు ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేస్తున్నారు. పవన్ రాక కోసం జనసేన శ్రేణులు కూడా పెద్దసంఖ్యలో ఎదురు చూస్తున్నారు. పవన్‌కల్యాణ్ కోసం సూర్యలంక తీరాన్ని ముస్తాబు చేశారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం 9:15కు పవన్ చేరుకోనున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో సూర్యలంకతీరం చప్టా సమీపంలో రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన తాటి మొక్కలు నాటి గ్రీన్‌వాల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తీరప్రాంత భద్రతకు రక్షణ కవచంగా ఉండేలా గ్రీన్‌వాల్ ఏర్పాటు ఆవశ్యకతపై ఆయా విభాగాల అధికారులతో చర్చించనున్నారు. నగరవనంలో అటవీ అమరవీరుల దినోత్సవంలో పాల్గొంటారు. సూర్యలంక రోడ్డులోని నగరవనంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల స్థూపాన్ని డిప్యూటీ సీఎం ఆవిష్కరించనున్నారు. అటవీ సంపదను కాపాడే క్రమంలో విధి నిర్వహణలో రాష్ట్రవ్యాప్తంగా అమరులైన 23 మంది కుటుంబాలతో పవన్‌కల్యాణ్ ఆత్మీయంగా సమావేశం కానున్నారు. వారికి ఆర్థిక సాయం కూడా అందించనున్నారు. డ్వామా, అటవీ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను డిప్యూటీ సీఎం తిలకించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జనసేన నాయకులు ఉన్నారు. పవన్ పర్యటనకు సంబంధించిన కాన్వాయ్ ట్రయల్‌రన్ కూడా బుధవారం సాయంత్రం జరిగింది. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థంగా విధులు నిర్వహించాలని ఎస్పీ తుషార్‌డూడి ఆదేశించారు. ఎస్పీ నిర్వహించిన సమావేశంలో డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎండీ మొయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది త్యాగాలు గుర్తుచేసుకునేందుకు..

ప్రతి ఏడాది సెప్టెంబరు 11న జాతీయ అటవీ అమరవీరుల దినాన్ని నిర్వహిస్తారు. ఖేజ్రీ చెట్లను రక్షించడానికి బిష్ణోయ్ తెగవారు చేసిన చారిత్రాత్మక త్యాగానికి చిహ్నంగా సెప్టెంబరు 11కు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అటవీ సిబ్బంది త్యాగాలను గుర్తు చేసుకుని వారికి డిప్యూటీ సీఎం పవన్ నివాళులు అర్పించనున్నారు.



పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణతేజ, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే వేగేశన

అమ్మాయిలు..అదే జోరు

సూపర్-4లో కొరియాపై భారత్ గెలుపు

ఆసియా కప్ హాకీ



హాంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. టోర్నీలో ఒక్క ఓటమి కూడా కూడా లేకుండా గ్రూప్ దశను టాపర్‌గా ముగించిన మన అమ్మాయిల బృందం.. సూపర్-4లోనూ అంతేదీటుగా విజృంభిస్తోంది. బుధవారం జరిగిన సూపర్-4 తొలి పోరులో భారత్ 4-2తో కొరియాను చిత్తు చేసింది. భారత జట్టులో వైష్ణవి (2వ), సంగీతా కుమారి (33వ), లాల్‌రెమ్సియామి (40వ), రుతుజ (59వ) తలో గోల్ సాధించారు. కొరియా తరపున యుజిన్ కిమ్ (33వ, 53వ) రెండు గోల్స్ చేసింది. భారత్ తమ రెండో మ్యాచ్‌ను గురువారం చైనాతో ఆడనుంది. నాలుగు జట్లు తలపడే సూపర్-4లో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరతాయి.

అన్‌సీడెడ్ చేతిలో..

- సింధు పరాజయం
- ప్రణయ్, సేన్ ముందంజ
- హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు హాంకాంగ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ భారత స్టార్ అనూహ్యంగా ఆదిలోనే అన్‌సీడెడ్ చేతిలో పరాజయం పాలై నిరాశపరచింది. డెన్మార్క్‌కు చెందిన క్రిస్టోఫర్సెన్ 15-21, 21-16, 21-19తో సింధుకు షాకిచ్చి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 22-20, 16-21, 21-15తో తైపీ ఆటగాడు వాంగ్ జు వీపై, ప్రణయ్ 21-17, 21-14తో చైనా షట్లర్ లూ గువాంగ జూపై, ఆయుష్ శెట్టి 15-21, 21-19, 21-13తో సూ లి యాంగ్ (తైపీ)పై, కిరణ్ జార్జ్ 21-16, 21-11తో జియా హెంగ్ జాసన్ తె (సింగపూర్)పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్‌లో రీతుపర్ణ పండా/శ్వేతపర్ణ పండా జోడీ 21-17, 21-9తో స్థానిక జంట వానెస్సా పాంగ్/సమ్ యా వాంగ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. సింగిల్స్‌లో రక్షిత రామరాజు, అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా/ధ్రువ్ కపిల, రుత్వికా శివాని/రోహన్ కపూర్ ద్వయం జోడీలు ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

బిష్ణోయ్‌కు 6, అర్ష్‌దీప్‌నకు 10

దుబాయ్: టీమిండియా బౌలర్లు రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో చెరోస్థానం మెరుగుపర్చుకుని ముందంజ వేశారు. వీరు వరుసగా 6, 10వ ర్యాంకుల్లో నిలిచారు. వరుణ్ చక్రవర్తి 4వ ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత్ తరపున టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ నెంబర్‌వన్ ర్యాంక్‌ను పదిలం చేసుకున్నాడు.

27 బంతుల్లోనే..

భారత్ సునాయాస విజయం

యూఏఈ 57 ఆలౌట్

కుల్దీప్‌కు 4, దూబేకి 3 వికెట్లు



ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x హాంకాంగ్

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

దుబాయ్: డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. ఆసియా కప్‌లో ఘనంగా బోణీ చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్ (4/7), శివం దూబే (3/4) తిప్పేయడంతో.. గ్రూప్-ఎలో బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. 79 బంతుల్లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన టీమిండియా.. కేవలం 27 బంతుల్లోనే లక్ష్యాన్ని ఊదేసింది. దీంతో మొత్తం 106 బంతుల్లోనే మ్యాచ్ ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ 13.1 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. అలీషాన్ షరాఫు (22), మహ్మద్ వసీం (19) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. శివం దూబే మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 4.3 ఓవర్లలో 60/1 స్కోరు చేసి గెలిచింది. అభిషేక్ శర్మ (30), శుభ్‌మన్ గిల్ (20 నాటౌట్) రాణించారు. జునైద్ ఒక వికెట్ దక్కించుకొన్నాడు.

అలవోకగా..: స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్లు అభిషేక్, గిల్ ప్రత్యర్థి బౌలింగ్‌ను ఉతికి ఆరేశారు. తొలి బంతినే సిక్స్‌కు తరలించిన శర్మ.. రెండో బంతికి బౌండ్రీ సాధించాడు. రెండో ఓవర్‌లో రోహిద్ బౌలింగ్‌లో గిల్ 4,6తో 15 పరుగులు రాబట్టడంతో స్కోరు బోర్డు దూసుకెళ్లింది. మరో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టిన అభిషేక్‌ను జునైద్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 10 పరుగులు కావల్సి ఉండగా.. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ (7 నాటౌట్) ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. మరో వైపు బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేసిన గిల్.. మరో 93 బంతులు మిగిలుండగానే జట్టుకు ఘన విజయం అందించాడు.

పెవిలియన్‌కు క్యూ..: పవర్‌ప్లేలో పర్వాలేదనిపించినా.. కుల్దీప్ స్పిన్ ఉచ్చులో చిక్కుకొన్న యూఏఈ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈకి ఓపెనర్ అలీషాన్ మెరుగైన ఆరంభాన్నే ఇచ్చాడు. పాండ్యా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదాడు. బుమ్రా బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన షరాఫు.. అక్షర్ వేసిన మూడో ఓవర్‌లో సిక్స్‌తో బ్యాట్ ఝుళిపించాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా యార్కర్‌కు అలీషాన్ పెవిలియన్ చేరాడు. దీంతో తొలి వికెట్‌కు 26 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్ బ్యాటర్ జోహైబ్ (2)ను వరుణ్ క్యాచవుట్ చేశాడు. కానీ, ఆరో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో వసీం మూడు బౌండ్రీలతో 12 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను యూఏఈ 41/2తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో కుల్దీప్ మాయాజాలంతో ఒక్కసారిగా కుదేలైంది. 8వ ఓవర్‌లో రాహుల్ చోప్రా (3), వసీంతోపాటు హర్షిత్ కౌశిక్ (2)ను కుల్దీప్ అవుట్ చేయడంతో.. యూఏఈ 50/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆసిఫ్ ఖాన్ (2), ధ్రువ్ (1), జునైద్ సిద్దిఖీ (0)ను దూబే పెవిలియన్ చేర్చాడు. హైదర్ అలీ (1)ను క్యాచవుట్ చేసిన కుల్దీప్.. యూఏఈ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్కోరుబోర్డు

యూఏఈ: అలిషన్ షరాపు (బి) బుమ్రా 22, మహ్మద్ వసీమ్ (ఎల్బీ) కుల్దీప్ 19, జొహైబ్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 2, రాహుల్ చోప్రా (సి) గిల్ (బి) కుల్దీప్ 3, ఆసిఫ్ (సి) శాంసన్ (బి) దూబే 2, హర్షిత్ (బి) కుల్దీప్ 2, ధ్రువ్ పరాషర్ (ఎల్బీ) దూబే 1, సిమ్రన్‌జీత్ (ఎల్బీ) అక్షర్ 1, హైదర్ (సి) శాంసన్ (బి) కుల్దీప్ 1, సిద్దిఖీ (సి) సూర్య (బి) దూబే 0, మహ్మద్ రోహిద్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.1 ఓవర్లలో 57 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-47, 4-48, 5-50, 6-51, 7-52, 8-54, 9-55, 10-57; **బౌలింగ్:** హార్దిక్ 1-0-10-0, బుమ్రా 3-0-19-1, అక్షర్ 3-0-13-1, వరుణ్ చక్రవర్తి 2-0-4-1, కుల్దీప్ 2.1-0-7-4, శివమ్ దూబే 2-0-4-3.

భారత్: అభిషేక్ (సి) హైదర్ (బి) సిద్దిఖీ 30, గిల్ (నాటౌట్) 20, సూర్యకుమార్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 3, మొత్తం: 4.3 ఓవర్లలో 60/1; వికెట్ పతనం:** 1-48; **బౌలింగ్:** హైదర్ 1-0-10-0, రోహిద్ 1-0-15-0, పరాషర్ 1-0-13-0, సిద్దిఖీ 1-0-16-1, సిమ్రన్‌జీత్ సింగ్ 0.3-0-6-0.

1

4.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. టీ20ల్లో తన వేగవంతమైన ఛేదనను నమోదు చేసింది. గతంలో స్కాట్లాండ్‌పై 6.3 ఓవర్లలోనే ఛేదించిన రికార్డును టీమిండియా ఈ మ్యాచ్‌లో తిరగరాసింది.

టైటాన్స్ హ్యాట్రిక్

ముంబాపై గెలుపు ● ప్రొ కబడ్డీ



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ విశాఖపట్నం అంచెను తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్ విజయంతో ముగించింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 45-37 స్కోరుతో యు ముంబాను చిత్తుచేసింది. టైటాన్స్ రైడర్లు, డిఫెండర్లు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. తొలి భాగంలో టైటాన్స్‌ను ముంబా ఆటగాళ్లు నిలువరించలేకపోయారు. దీంతో ప్రథమార్థం 27-11తో ముగిసింది. ద్వితీయార్థంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు అదే జోరు కొనసాగించి మరోసారి యు ముంబాను ఆలౌట్ చేసి సురక్షితమైన ఆధిక్యాన్ని సాధించారు. టైటాన్స్ ధాటికి ఒత్తిడికి గురైన ముంబా వరుస లైనౌట్‌లతో పాయింట్లు సమర్పించుకుంది. చివరి నిమిషాలలో అనూహ్యంగా పుంజుకున్న ముంబా ఆటగాళ్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేసినా ఫలితం లేకపోయింది. టైటాన్స్‌లో రైడర్ భరత్ 13 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించగా, యు ముంబాలో సందీప్‌కుమార్, అమి మహ్మద్ జఫర్ దనేష్ చెరో ఏడు పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 43-32తో యూపీ యోధాస్‌ను ఓడించింది.

నిఖత్‌కు నిరాశ

క్వార్టర్స్‌లో ఓటమి

సెమీఫైనల్‌కు నూపుర్, జాస్మిన్

భారత్‌కు రెండు పతకాలు ఖరారు

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్


నిఖత్


నూపుర్ షెరాన్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో టైటిల్ మిస్సయింది. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ పోరాటం ఈసారి క్వార్టర్‌ఫైనల్‌కే పరిమితమైంది. గతసారి (2023) 50 కిలోలు, అంతకుముందు (2022) 52 కిలోల విభాగాలలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి 51 కిలోల బరిలో దిగింది. అయితే బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జరీన్ 0-5తో రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో చిత్తయింది. దాంతో టోర్నీ నుంచి నిఖత్ రిక్తహస్తాలతో వెనుదిరిగింది. అయితే, నిఖత్ నిరాశపరిచినా.. హరియాణా బాక్సర్లు నూపుర్ షెరాన్, జాస్మిన్ లంబోరియా తమ విభాగాల్లో సత్తా చాటి భారత్‌కు రెండు పతకాలు ఖాయం చేశారు. మహిళల 80+ కేజీల విభాగంలో నూపుర్, 57 కిలోల కేటగిరిలో జాస్మిన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దిగ్గజ బాక్సర్ హవా సింగ్ మనుమరాలైన 26 ఏళ్ల నూపుర్ క్వార్టర్‌ఫైనల్లో 4-1తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒల్టినోయ్ సోతింబేవను చిత్తు చేసింది. మరో క్వార్టర్స్ బౌట్‌లో జాస్మిన్ 5-0తో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ ఖుమోరాబోను మమజొనొవాటపై గెలిచింది. సెమీఫైనల్స్‌లో ఓడినా వీళ్లకు కాంస్య పతకాలు దక్కుతాయి. ఇక..పురుషుల కేటగిరీలో జాదుమని సింగ్ (48 కి), అభినాష్ జమ్వాల్ (65 కి) క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టి పతకానికి ఒక్క విజయం దూరంలో నిలిచారు. కాగా, మరో భారత బాక్సర్ జుగ్నూ అహ్లావత్ (85 కి) తొలి రౌండ్ పరాజయంతో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.

భారత్-పాక్ మ్యాచ్‌కు తగ్గిన డిమాండ్!

పూర్తిగా అమ్ముడుపోని టికెట్లు

దుబాయ్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అంటే టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ రెండు జట్లు తొలిసారిగా తలపడనుండడంతో.. డిమాండ్ భారీగా ఉంటుందని అంచనా వేశారు. కానీ, ఆసియాకప్‌లో ఆదివారం జరిగే ఇండో-పాక్ మ్యాచ్ టికెట్లు ఇంకా అందుబాటులో ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. హైవోల్టేజ్ మ్యాచ్‌కు డిమాండ్ తగ్గడానికి అధిక ధరలే కారణమని తెలుస్తోంది. రెండు సీట్లకు రూ. 10,000 అన్నింటికంటే తక్కువ. వీఐపీ రాయల్ బాక్స్‌లో జతకు రూ. 2,30,700, స్కైబాక్స్ టికెట్ రూ. 1,67,851గా నిర్ణయించారు. ప్లాటినం రూ. 75,658, గ్రాండ్ లాంజ్ రూ. 41,153 లాంటి మధ్య శ్రేణి టికెట్లు కూడా సగటు ప్రేక్షకుడికి అందుబాటులో లేవు.

తుపాకీ గురిపెట్టి..క్రికెటర్ల దోపిడీ

బార్బడోస్‌లో ఘటన

బార్బడోస్: కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో సెయింట్ కిట్స్, నెవిస్ పేట్రియాట్స్ జట్టు ఆటగాళ్లు దోపిడీకి గురయ్యారు. ఆ క్రికెటర్లు, సీపీఎల్ అధికారి ఒకరు ఓ ప్రయివేట్ ఈవెంట్‌ను ముగించుకొని మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హోటల్‌కు వెళుతూ మార్గమధ్యంలో ఆహారంకోసం ఒకచోట ఆగారు. ఆ సమయంలో కొందరు దొంగలు.. క్రికెటర్లు, ఆ అధికారిని తుపాకీతో బెదిరించి నగలు, ఇతర విలువైన వస్తువులు దోచుకొన్నారు. ఈక్రమంలో క్రికెటర్లు దొంగలను ప్రతిఘటించగా వారి మధ్య పెనుగులాట జరిగింది. పెనుగులాటలో దొంగలు ఓ తుపాకీని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ ఘటనలో క్రికెటర్లు సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలి నుంచి పోలీసులు ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

మస్క్‌ను వెనక్కి నెట్టిన ల్యారీ ఎల్లిసన్

ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానానికి



న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్ సహ-వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ ప్రపంచ ధనవంతుల జాబితాలో టెస్లా సారథి ఎలాన్ మస్క్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి ఎగబాకారు. ఫోర్బ్స్ రియల్ టైం బిలియనీర్స్ లిస్ట్ ప్రకారం.. 81 ఏళ్ల ఎల్లిసన్ వ్యక్తిగత సంపద బుధవారం ఏకంగా 10,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.8.89 లక్షల కోట్లు) పెరిగి మొత్తం రూ.39,570 కోట్ల డాలర్లకు (రూ.34.82 లక్షల కోట్లు) చేరుకుంది. ఒరాకిల్ షేరు ఒక్కరోజే ఏకంగా 41 శాతం పెరగడం ఇందుకు దోహదపడింది. 1992 తర్వాత ఒక్క రోజులో కంపెనీ షేరు ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. దాంతో ఒరాకిల్ మార్కెట్ విలువ 29,900 కోట్ల డాలర్ల మేర పెరిగి లక్ష కోట్ల డాలర్లకు చేరువైంది. ప్రస్తుతం సంస్థలో ఎల్లిసన్ 41 శాతం వాటా కలిగి ఉన్నారు. ఒరాకిల్ త్రైమాసిక పనితీరు మార్కెట్ అంచనాలను మించడంతోపాటు క్లౌడ్ వ్యాపారం భవిష్యత్‌పై అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం కంపెనీ షేర్లు భారీగా ర్యాలీ తీశాయి. కాగా, ప్రపంచ కుబేరుల జాబితాలో 300 రోజులుగా అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చిన మస్క్ రెండో స్థానానికి జారుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 38,500 కోట్ల డాలర్లకు (రూ.33.88 లక్షల కోట్లు) పరిమితమైంది.

మూడో రోజూ లాభాల్లో సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో అప్‌ట్రెండ్ బుధవారం నాడు కూడా కొనసాగింది. సెన్సెక్స్ 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద ముగియగా నిఫ్టీ 104.5 పాయింట్ల లాభంతో 24,973.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ లాభాలతో ముగియడం వరుసగా ఇది మూడో రోజు కాగా నిఫ్టీకి ఆరో రోజు. భారత-అమెరికా వాణిజ్య చర్చలు త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే రావచ్చునన్న ఆశలు, జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ భాగంలో కంపెనీల ఆదాయాలు బాగా పుంజుకుంటాయన్నఅంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు కూడా ఇందుకు తోడయ్యాయి.

- బుధవారం ప్రారంభమైన అర్బన్ కంపెనీ ఐపీఓకు మదుపరులు బ్రహ్మరథం పట్టారు. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొద్ది సేపటికే ఇష్యూ మొత్తం సబ్‌స్క్రైబ్ అయింది. తొలి రోజు ముగిసే సరికి 3.13 రెట్లు సబ్‌స్క్రైబ్ అయినట్టు సమాచారం.

ఎంఎఫ్ లావాదేవీల్లో ఎన్ఎస్ఈ రికార్డు: మ్యూచువల్ ఫండ్ లావాదేవీల్లో 'ఎన్ఎస్ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫాం' రికార్డు సృష్టించింది. బుధవారం ఈ వేదికపై రికార్డు స్థాయిలో 15 లక్షలకుపైగా లావాదేవీలు నమోదైనట్టు ఎన్ఎస్ఈ తెలిపింది. సభ్యులు, డిస్ట్రిబ్యూటర్ల నమ్మకం, మద్దతుతోనే ఇది సాధ్యమైందని ఎన్ఎస్ఈ పేర్కొంది.

కృత్రిమ మేధతో ప్రపంచ జీడీపీకి అదనంగా రూ.1,382 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) 21వ శతాబ్దిని నిర్వచించే టెక్నాలజీగా మారిందని, 2030 నాటికి ప్రపంచ జీడీపీకి ఇది 1570 కోట్ల డాలర్లు (రూ.1,382 లక్షల కోట్లు) జోడిస్తుందని ఫిక్కీ-బీసీజీ రూపొందించిన ఒక శ్వేతపత్రంలో అంచనా వేశాయి. అయితే ఏఐని అనుసరించే విషయంలో మాత్రం భారీ వ్యత్యాసాలున్నట్లు ఆ పత్రంలో తెలిపాయి. ప్రపంచ సమ్మిళిత వృద్ధికి ఏఐని ఒక సాధనంగా చేసుకోవాలని పిలుపు ఇచ్చాయి. ఏఐని అందరికీ అందుబాటులోకి తేవడానికి పరిశోధన, పెట్టుబడులు, నైపుణ్యాల కల్పన, నైతిక (రైజ్) నియమావళి అనుసరించాలని సూచించాయి. అందులోని ప్రధానాంశాలు...

- ఈ రంగంలో పరిశోధనలు, ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి.
- ఏఐని అందరికీ ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాలకు అందుబాటులోకి తేవడం లక్ష్యంగా పెట్టుబడులు, మౌలిక వసతులు విస్తరించాలి.
- ఏఐ ప్రతిభలో వ్యత్యాసాలు తొలగించేందుకు సిబ్బందిలో నైపుణ్యాలకు మెరుగులు దిద్దడంతో పాటు ఏఐ పరిజ్ఞానాన్ని అందరూ భారీ ఎత్తున పంచుకునే వాతావరణం సృష్టించాలి.
- ఏఐ వ్యవస్థలు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా ఉండేలా చూసేందుకు శక్తివంతమైన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

23 నుంచి గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

అమెజాన్ ఇండియా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025 ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రైబర్లు ఒక రోజు ముందే ఇందులో పాల్గొనవచ్చు. ఈ ఫెస్టివల్‌లో 17 లక్షల మందికి పైగా అమ్మకందారులు తమ ఉత్పత్తులను అమ్మకానికి పెడుతున్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అమ్మకందారులే 80,000 వరకు ఉంటారని అమెజాన్ ఇండియా డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్) తోట కిషోర్ చెప్పారు. రెండు రాష్ట్రాల్లోని 700కుపైగా డెలివరీ కేంద్రాల ద్వారా ఈ సారి తమ కస్టమర్లకు సరుకులు అందించనున్నట్టు తెలిపారు. జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఏడాది 'అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025' అమ్మకాలు భారీగా పుంజుకుంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ ఫెస్టివల్ అమ్మకాల రద్దీకి అనుగుణంగా సరుకులను కొనుగోలుదారులకు అందించేందుకు లక్షన్నర మంది సీజనల్ ఉద్యోగులను అమెజాన్ ఇండియా నియమించింది. తెలంగాణ సహా దేశంలోని ప్రధాన నగరాల్లో కొనుగోలు దారులు ఎక్కువగా మిడ్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు, టీవీల వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆసక్తి చూపిస్తున్నట్టు అమెజాన్ ఇండియా డైరెక్టర్ (కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్) జెబా ఖాన్ చెప్పారు.

ఈ ఏడాది వృద్ధి 6.9 శాతం

అంచనాలను పెంచిన ఫిచ్.. దేశీయ డిమాండ్ వృద్ధికి చోదకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరపతి రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో బలమైన వృద్ధి నమోదవడంతో పాటు దేశీయంగా వినియోగం భారీగా పుంజుకోనుండటం ఇందుకు కారణంగా పేర్కొంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ట్రంప్ సుంకాల నేపథ్యంలో పలు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు, బహుళజాతి ఆర్థిక సంస్థలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ వచ్చాయి. ఇలాంటి ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలోనూ వృద్ధి అంచనాలను పెంచిన తొలి అంతర్జాతీయ ఏజెన్సీ ఫిచ్. పైగా అన్ని ఏజెన్సీల్లోకెల్లా అత్యధిక వృద్ధిని అంచనా వేసింది కూడా ఇదే. దేశీయంగా వినియోగం భారీగా పెరగడంతో పాటు ట్రంప్ సుంకాల ప్రభావం నుంచి బయటపడేందుకు జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దోహదపడగలదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెలకుగాను ఫిచ్ విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్ ఔట్‌లుక్ నివేదికలోని మరిన్ని విషయాలు..

- ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 6.7 శాతం వృద్ధిని అంచనా వేయగా.. 7.8 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచుతున్నట్టు తెలిపింది.
- గడిచిన కొన్ని నెలల్లో అమెరికా-భారత్ మధ్య వాణిజ్య అనిశ్చితి పెరిగింది. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఆగస్టు 27 నుంచి 50 శాతానికి పెంచారు. భవిష్యత్‌లో ఈ సుంకం మళ్లీ దిగిరావచ్చని భావిస్తున్నాం. కానీ, అమెరికాతో వాణిజ్య సంబంధాలపై నెలకొన్న అనిశ్చితి వ్యాపార సెంటిమెంట్, పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపనుంది.
- ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్న జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగం పెరిగేందుకు దోహదపడనుంది. దేశీయ డిమాండే వృద్ధికి ప్రధాన చోదకం. బలమైన గృహ ఆదాయం వినియోగానికి, సులభమైన ఆర్థిక పరిస్థితులు పెట్టుబడులకు ఊతమివ్వనున్నాయి.
- ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మాత్రం వృద్ధి కాస్త నెమ్మదించవచ్చు. 2026-27లో వృద్ధిరేటు 6.3 శాతంగా, 2027-28 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- ఈ సారి మెరుగైన వర్షపాతం నమోదవడంతో పాటు అధిక స్థాయిలో ఆహార నిల్వలున్న నేపథ్యంలో ధరల సూచీ అదుపులోనే ఉండనుంది. ఈ ఏడాది చివరినాటికి వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3.2 శాతంగా, 2026 చివరినాటికి 4.1 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- ఈ ఏడాది చివర్లో ఆర్‌బీఐ రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించవచ్చు. వచ్చే ఏడాదిలో మాత్రం రెపో యథాతథంగా కొనసాగవచ్చు. ఆర్‌బీఐ 2027లో రెపోరేటును మళ్లీ పెంచేందుకు అవకాశాలున్నాయి.

రాజమండ్రిలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

100 పడకల సామర్థ్యంతో ఏర్పాటు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సేవలను మరింత విస్తరించింది. తాజాగా రాజమండ్రిలో 100 బెడ్ల సామర్థ్యంతో కూడిన ఆస్పత్రిని బుధవారం ప్రారంభించింది. ఏపీలో రెయిన్‌బోకు ఇది మూడో హాస్పిటల్. విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అంతేకాదు, ఈ ఆర్థిక సంవత్సరంలో వరంగల్, గువాహటి తర్వాత రెయిన్‌బో ప్రారంభించిన మూడో హాస్పిటల్ కూడా ఇదే. ఈ విస్తరణతో కలిపి రెయిన్‌బో మొత్తం 9 నగరాల్లో 2,300 పడకల సామర్థ్యంతో కూడిన 22 హాస్పిటళ్లు, 5 క్లినిక్‌లను నిర్వహిస్తోంది.

ఎస్రీ ఇండియాతో ధ్రువ స్పేస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ ఎస్రీ ఇండియాతో హైదరాబాద్ స్టార్టప్ ధ్రువ స్పేస్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ధ్రువ స్పేస్ తన ఆస్ట్రావ్యూ శాటిలైట్ ఇమేజరీ సర్వీస్‌ను ఎస్రీ ఇండియాకు చెందిన ఆర్క్‌జీఐఎస్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించనుంది. తద్వారా 200కు పైగా ఉపగ్రహాల నుంచి భూమి పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు మరింత సులభంగా పొందేందుకు వీలుపడనుంది.

బిజినెస్

రూ.35 తగ్గనున్న సిమెంట్ ధర

ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలతో సిమెంట్ ధరలు దిగి రానున్నాయి. ఈ తగ్గింపు 50 కిలోల బస్తాపై రూ.30 నుంచి రూ.35 వరకు ఉంటుందని ఇండియా రేటింగ్స్ అంచనా. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర కంపెనీని బట్టి రూ.330 నుంచి రూ.370 వరకు పలుకుతోంది. జీఎస్‌టీ ప్రయోజనాలను ఈ నెల 23 నుంచి వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలు భావిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే రిటైల్ మార్కెట్‌లోనూ బస్తా సిమెంట్ ధర రూ.30 నుంచి రూ.35 వరకు తగ్గుతుందని అంచనా.

ఎస్ఎస్ఎల్‌వీ తయారీ కోసం 3 కంపెనీలతో హెచ్ఏఎల్ ఒప్పందం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): 500 కిలోల కన్నా తక్కువ బరువు గల ఉపగ్రహాల ప్రయోగానికి స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ) తయారీ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) మధ్య సాంకేతిత బదిలీ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా హెచ్ఏఎల్ ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్లను సొంతంగా అభివృద్ధి చేయడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా స్వీకరిస్తుంది. ఇందుకోసం వచ్చే రెండేళ్లపాటు హెచ్ఏఎల్‌కు ఇస్రో అవసరమైన శిక్షణ ఇవ్వడంతోపాటు రాకెట్ల అభివృద్ధికి సాంకేతిక మద్దతుని వ్వనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	137
వరంగల్	118	గుంటూరు	127
కరీంనగర్	118	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	111
కర్నూలు	118	నెల్లూరు	116
విశాఖపట్నం	141	అనంతపురం	116
గోదావరి	137		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,510 ▲	1,01,300 ▲	1,40,000 ▲
విజయవాడ	1,13,000 ▲	1,07,000 ▲	1,28,270 ▲
విశాఖపట్నం	1,12,990 ▲	1,01,300 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,510 ▲	1,01,300 ▲	1,27,900 ▼
ప్రొద్దుటూరు	1,13,700 ▲	1,04,600 ▲	1,28,000 ▼
ముంబై	1,09,640 ▲	1,00,430 ▲	1,24,590 ▼

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి

గుంటూరు లీగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ నెల 13న జాతీయస్థాయి లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ హోదాలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ధనం, సమయం వృథా చేసుకోకుండా త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

వాస్తవాలు దాచి ప్రజల్ని తప్పుదోవ పట్టించే కుట్రలు

● వైసీపీ అధ్యక్షుడు జగన్ విమర్శలపై చీఫ్ విప్ జీవీ ధ్వజం

వినుకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలోని పాపాలను దాచిపెట్టి ప్రజల్ని జగన్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతూ ఏదో జరిగిపోతోందని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అమరా వతిని పరుగులు పెట్టిస్తూ, సామాజిక పింఛన్ల కోసం ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే ముందు జగన్ తన ఐదేళ్ల నిర్వాకాలను అద్దంలో చూసుకోవాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రైతుల తలసరి అప్పుల్లో ఏపీ మొదటిస్థానంలో నిలిచిందని, ఒక్కో రైతు నెత్తిన రూ.2.43లక్షల చొప్పున అప్పులు ఉన్నట్లు గణాంకాలు రుజువు చేశాయన్నారు. ఆ ఐదేళ్ల రైతు ఆత్మహత్యల్లో ఏపీ దేశంలో 3వ స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఎందుకు నిలిచిందో జగన్ చెప్పాలన్నారు. ఆర్బీకేల గురించి గొప్పగా చెప్పిన జగన్ పాలనలో ధాన్యం కొనుగోళ్లకు కనీసం గోనె సంచులు ఇవ్వని దుస్థితి చూశామన్నారు. 2019లో ఎన్నికలకు ముందు రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పారని, ఇప్పుడొచ్చి ధరల స్థిరీకరణకు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అలాగే 17 మెడికల్ కళాశాలలను మొదలు పెట్టామని చెప్పుకుంటున్న జగన్ వాటిని ఎందుకు పూర్తి చేయలేదో వివరించి ఉంటే బాగుండేదన్నారు. చివరకు పులివెందుల మెడికల్ కళాశాలకే ఎన్ఎంసీ గుర్తింపు రాలేదంటే వాటి విషయంలో జగన్ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చన్నారు. నాడు ఆగిపోయిన వైద్య కళాశాలలను ఎలాగైనా పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పిస్తే దానిపైనా బురద జల్లడం జగన్‌కే చెల్లిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వైద్య రంగానికి 4 శాతం బడ్జెట్ కేటాయిస్తే దాన్ని వైసీపీ ప్రభుత్వం ఒక శాతానికి తగ్గించిందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో జగన్‌కు సమాధానం చెబుతారన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130. 139. 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గ్రామీణ ఆర్థిక వికాసంతోనే.. సుసంపన్న భారత్

● భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగరాజు ● దివంగత శాస్త్రవేత్త నాయుడమ్మ పురస్కారం ప్రదానం

తెనాలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక రంగంలోనూ శాస్త్ర, సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చామని, డిజిటల్ విధానం మన దేశ ఆర్థిక స్థితినే మార్చివేసిందని.. అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సేవల విభాగం కార్యదర్శి నాగరాజు మద్దిరాల పేర్కొన్నారు. గ్రామీణ భారతావనిని ప్రపంచ దేశాలకు దగ్గర చేయడం ద్వారానే ఇదంతా సాధ్యమైందని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో సుసంపన్న భారత్ లక్ష్యంగా మరిన్ని సంస్కరణలు తీసుకొస్తున్నట్టు చెప్పారు. ప్రపంచ ఖ్యాతి పొందిన శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పురస్కార ప్రదాన కార్యక్రమం తెనాలిలో యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ రమణ దాబాలు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజు దంపతులకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రదానోత్సవ సభలో తొలుత నాయుడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయుడమ్మ డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించారు. నాయుడమ్మ పురస్కారాన్ని ఇప్పటి వరకు ఎందరో ప్రపంచ మేధావులు, గొప్పవారు అందుకున్నారు. వారి సరసన తాను నిలవడం గర్వంగా ఉందని అవార్డు గ్రహీత నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలు ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారమని, అవి అభివృద్ధి చెందితే దేశం ఆర్థికంగా ప్రగతి సాధిస్తుందని, ఆ దిశగానే ప్రభుత్వ ఆలోచన ఉందని పేర్కొన్నారు. యూపీఐ భారతీయ ఆర్థిక లావాదేవీల విధానాన్ని పూర్తిగా మార్చివేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలను ఎంపీసంఘాలను అనుసంధానం చేయడం వంటివి వికసిత భారత్- 2047కు ముఖ్య పునాదిగా మారాయన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ప్రజల కోసం పని చేసే శాస్త్రవేత్తలను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్నారు. అటువంటివారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరన్నారు. శాస్త్రవేత్తలు సెమినార్‌లకే పరిమితం కాకుండా జనంలోకి వెళితే, వారి అవసరాలు తెలుస్తాయని అభిప్రాయపడ్డారు. తద్వారా వారికి మేలు చేసే విధంగా పరిశోధనలు చేయవచ్చని పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభలో సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు, ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే గోగినేని ఉమ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న జీడీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, యార్డు చైర్మన్ నీలాల కృష్ణారావు

తాడికొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతుకు యూరియా అందుబాటులో ఉందని గుంటూరు కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబు చెప్పారు. బుధవారం తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా చాలినంత ఉందని చెప్పారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా బస్తాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. తాడికొండ శాఖలో డీఏపీ 20 టన్నులు, యూరియా 20 టన్నులు నిల్వలు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులను పరామర్శల పేరుతో పంటలను వైసీపీ క్యాడర్ నాశనం చేస్తోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని హరిబాబు తెలిపారు. అనంతరం మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు తోట కూర శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా 603 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని చెప్పారు. యూరియాను అధికంగా వినియోగించటం వల్ల చీడపీడల సమస్య ఎక్కువవుతుందని తెలిపారు. అవసరం మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని శ్రీనివాసరావు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ నీలాల కృష్ణారావు, తాడికొండ సొసైటీ చైర్మన్ గోగినేని శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌నాయక్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఆలపాటి బాలయ్య పాల్గొన్నారు.

పరిశీలన ప్రహసనం

(5వ పేజీ తరువాయి)

ఈడబ్ల్యూఎస్‌కి ఎలా అర్హత పొందుతారనే సమస్య వచ్చింది. దీంతో ఐటీ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారంతో అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసిన వారు దాదాపు 100 మందికి పైగా ఉన్నారు. వీరు ఈడబ్ల్యూఎస్‌కు అర్హులా కాదా అనే తేల్చే పని అధికారులకు కత్తి మీదసాములా మారింది.

నాలుగైదు దఫాలుగా..

దివ్యాంగుల విషయానికి వస్తే కొన్ని సమస్యలు కొలి క్కిరాలేదు. ప్రధానంగా వినికిడి సమస్యతో సర్టిఫికెట్లు పొందిన వారు వాటిని నిర్ధారించుకోలేక పోతున్నారు. దీంతో వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు మళ్లీ పిలవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన ఇప్పటికే నాలుగైదు దఫాలుగా నిర్వహించారు. అయినా ఇంకా మరో పది మంది సర్టిఫికెట్లను నిర్ధారించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఆ యా సమస్యలు పరిష్కరించుకుంటూ నిర్దేశించిన నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు.

సున్నా వడ్డీ కలేనా?

(5వ పేజీ తరువాయి)

ఇస్తానని చెప్పింది. కానీ, పథకాన్ని 15 నెలలు ఆలస్యంగా ప్రారంభించి కాల హరణం చేసింది. రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న, మూడో విడత రుణ మాఫీ ని ఆరు నెలల ఆలస్యంగా 2023 మార్చి 25న ప్రారంభించారు. 2024 ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకూ నాలు గో విడత ఆసరాని ఆపేసి మూడు జిల్లాల్లోని డ్వాక్రా మహి ళలకు రూ.699 కోట్లు ఎగవేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్ డీఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో విభజిత గుంటూరు జిల్లాలో 29,322 డ్వాక్రా సంఘాలకు చెందిన 2.86 లక్షల మందికి రూ.246 కోట్లు, పల్నాడు జిల్లాలో 25,168 గ్రూపుల్లో 2,47,833 మందికి ఆసరా కింద రూ. రూ.190 కోట్లు, బాపట్ల జిల్లాలో 30,604 గ్రూపులకు గాను.. మూడు లక్షల మందికి రూ. 263 కోట్లు ఆసరా పథకం కింద నాలుగో విడత రుణ మాఫీ జరగాల్సి ఉంది. దాన్ని గత ప్రభుత్వం ఎగవేయడం తో ఆ భారాన్ని మహిళలే మోయాల్సి వస్తోంది. దీనికి తోడు గడిచిన 15 నెలల వడ్డీ కూడా వారిపై పడడంతో స్వయం స హాయక సంఘాల మహిళల కు అనాసక్తికి గురవుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్‌కు పనికోసం వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘా తానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన ముప్పవరపు సురేశ్ (27) విద్యుత్ పనులు చేస్తుం టాడు. బుధవారం జమ్మలమడక గ్రామ సమీపంలో విద్యుత్ లైన్ లాగే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మాచర్ల రూరల్ ఎస్సై సంధ్యారాణి కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం సురేశ్ మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మధ్యాహ్న భోజన బియ్యంపై అప్రమత్తంగా ఉండాలి

● లెక్కల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటాం ● హెచ్‌ఎంలకు డైరెక్టర్ హెచ్చరిక

సత్తెనపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిలువ లెక్కల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తప్పవని మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ప్రధానోపాధ్యాయులను హెచ్చరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం బియ్యం విషయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం కిలో రూ.48 విలువైన మంచి బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని పరిగణనలోకి తీసుకొని హెచ్‌ఎంలు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాలల్లో బియ్యం పాత స్టాక్ లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, మధ్యాహ్న భోజనం తింటున్న వారి సంఖ్య ఆధారంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో ఎంత మంది విద్యా ర్థులు భోజనం చేస్తున్నారన్న విషయాన్ని పరిగణ నలోకి తీసుకొని నెల చివరిలో బియ్యం ఇండెంట్ పెట్టాలని, ఆ మేరకు బియ్యం నిల్వలకు సంబంధిం చిన స్టాక్ రిజిస్టర్‌ను నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో వచ్చే నెలకు ఎంత మేర బియ్యం అవసరమో ఈ నెల 12 లోగా ఇండెంట్ పెట్టాలని హెచ్‌ఎంలకు డైరెక్టర్ ఆదేశించారు.

స్నేహితుల చేతిలో యువకుడి హత్య

మాచర్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాచర్లలోని శ్రీశైలం రోడ్డులో ఓ యువకుడు తన స్నేహితుల చేతిలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన తిరుమలకొండ చంద్రశేఖర్ (30) మంగళవారం తన స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. అనంతరం ఏదో విషయమై వారి మధ్య గొడవ మొదలైంది. ఇది కాస్తా ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్లింది. చంద్రశేఖర్ స్నేహితులు అతడిపై దాడిచేసి బండరాళ్లతో తలపై మోద డంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం అతడి స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ తల్లి వెంకాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన యువకులను పట్టణ సీఐ ప్రభాకరరావు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

జిల్లా పౌరసమాచారశాఖ ఏడీగా వెంకటరమణ



కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా పౌర సమాచార శాఖ ఏడీ పి.వెంకటరమణ

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసమాచారశాఖ ఏడీగా పి.వెంకటరమణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ నందు డీపీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ పదోన్నతిపై బాపట్ల జిల్లాకు వచ్చారు. సమాచార పౌరసంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షుశుక్లా ఉత్తర్వుల మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డ్వామా ఏపీడీగా శివన్నారాయణ



కలెక్టర్ జె.వెంకటమురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డ్వామా ఏపీడీ శివన్నారాయణ

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డ్వామా ఏపీడీగా శివన్నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. చీరాల ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఏపీడీగా బాపట్లలో బాధ్యతలు చేపట్టి కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డ్వామా సహాయ సంచాలకుడిగా సింగయ్య



కలెక్టర్ జె.వెంకటమురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డ్వామా సహాయ సంచాలకుడు బి.సింగయ్య

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డ్వామా సహాయ సంచాలకుడిగా బి.సింగయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. అద్దంకి ఎంపీడీవోగా పనిచేస్తూ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పదోన్నతి పొంది డ్వామా సహాయ సంచాలకుడిగా బాధ్యతలు చేపట్టి కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలెక్టర్ అభినందించారు.

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

సిటీ యూనిట్ అధ్యక్షుడిగా మహబూబ్ బాషా

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ బాపట్ల సిటీ యూనిట్ అధ్యక్షుడిగా షేక్ మహబూబ్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం చీరాల తహసీల్దార్ కె.గోపికృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘ నియమనిబంధనల మేరకు సిటీయూనిట్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షులుగా ఎ.సౌజన్య, బి.శ్రీనివాసరావు, జె.రాజ్యలక్ష్మీ, కార్యదర్శిగా ఎ.సుమంతరాజు, జాయింట్ సెక్రటరీగా ఎం.మాధురి, టి.తరుణ్‌రాజు, కోశాధికారిగా ఎస్.శివరామకృష్ణ, ఈసీమెంబర్లుగా జి.ప్రతాప్,జి.సుధాకరరావు, పి.రమేష్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి సంఘ బైలా ప్రకారం ప్రమాణం చేయించి ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఎన్నికల కమిటీని కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి డి.మల్లికార్జునరావు అభినందించారు. జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఓంకార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యూనాంట్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ జేవీ మురళి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ నారాయణభట్టు

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

● కలెక్టర్ జే.వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల సమయంలో రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం రెడ్‌క్రాస్ సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు వార్షిక నివేదికను సమర్పించారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ పటానికి పుష్పాంజలి ఘటించారు. రెడ్‌క్రాస్ ద్వారా విశేష సేవలందించిన 18మంది సభ్యులకు కలెక్టర్ చేతుల మీదగా అవార్డులు అందజేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బీఎస్ నారాయణభట్టు, వైస్‌చైర్మన్‌గా బి.రామసుబ్బారావు, కోశాధికారిగా టి.ప్రసాదరెడ్డి 9మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు కలిసి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానది వరద విపత్తు సమయంలో రెడ్‌క్రాస్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. గవర్నర్ నుంచి బంగారుపతకం అందుకునేలా రెడ్‌క్రాస్ సంస్థ కృషి చేసిందన్నారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చే వారికి భోజనం పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ మంచి సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. రాజకీయ ప్రస్థానం ముగిసిన తర్వాత జీవితకాలం రెడ్‌క్రాస్‌లో పని చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏవో మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వెంకటశివన్నారాయణ, బూర్ల రామసుబ్బారావు, దేశిరాజు వెంకటరమణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాఫీతోటల పరిశోధనకు వ్యవసాయ కళాశాల బృందం

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అరకు కాఫీ తోటల పరిశోధనకు బాపట్ల వ్యవసాయ కళాశాల బృందం వెళ్లింది. కాఫీ పంటలకు అత్యంత హానికరమైన కాఫీబెర్రి బోరల్ పురుగు వ్యాప్తి స్థితిని అంచనా వేయటానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కూడిన బృందం అరకులో పరిశోధన చేస్తున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి తెలిపారు. కీటకశాస్త్ర విభాగాధిపతి ఎస్ఆర్.కోటేశ్వరరావు, కీటక శాస్త్ర ఆచార్యులు జి.వంశీకృష్ణ, ఉద్యాన విభాగాచార్యులు సీహెచ్.దుర్గాహేమంత్‌కుమార్ మార్గదర్శకత్వంలో 25మంది ఎమ్మెస్సీ వ్యవసాయ విద్యార్థులు సర్వే చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఆఫ్రికాకు చెందిన ఈ చిన్న పురుగు కాఫీకి అత్యంత హానికరమైనదని ఇది కాఫీ ఉత్పత్తుల నాణ్యతను, దిగుబడిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా 500 మిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక నష్టాన్ని కలుగచేస్తుందని ఎస్.ఆర్.కోటేశ్వరరావు తెలిపారు.



అరకు కాఫీ తోటల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల బృందం

అబ్దుల్ హమీద్ సేవలు చిరస్మరణీయం

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పరమవీరచక్ర బిరుదాంకితుడు, అమర సైనికుడు అబ్దుల్ హమీద్ సేవలు చిరస్మరణీయమని గుంటూరు డివిజన్ రైల్వేబోర్డుమెంబరు పఠాన్ రాజేష్ శ్లాఘించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం అబ్దుల్ హమీద్ 60వ వర్థంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి యుద్ధంలో ఆయన ప్రదర్శించిన ధైర్య సాహసాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె.కొండలు, జి.కొండలు, నర్రా కొండలు, గేరా చార్లెస్, దేవరకొండ రాము, మోహన్, దయారావు, నక్కా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరణ చేసుకోవాలి

కర్లపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ అధికారి వి.శోభన్‌బాబు అన్నారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ అనధికార లే-అవుట్ వేసినవారు అక్టోబరు 24లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఏ విధమైన భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవించి ఉన్నంత కాలం ప్రజాసేవలోనే ఉంటాను

● జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆనందబాబు



వేమూరు ఎన్టీఆర్ పురవేదికపై బర్త్ డే కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవించి ఉన్నంత కాలం ప్రజా సేవలోనే బ్రతుకుతానని, రాజకీయ రంగంలో తనను అంచెలంచెలుగా ఎదిగేందుకు సహకరించిన నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో రుణపడి ఉంటానని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. వేమూరులో బుధవారం ఎమ్మెల్యే జన్మదిన వేడుకను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆనందబాబును బాణసంచా, కోలాట భజనలు, రాజస్థాన్ బ్యాండ్‌తో యువత కేరింతలతో శ్రేణులు వేమూరు శివారులో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ నుండి నాలుగు సార్లు పోటీ చేసి మూడుసార్లు ఎమ్మెల్యేగా అలాగే మంత్రి స్థానానికి కూడా చేరుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. సభలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఉసా రాజేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ అఖిలేష్‌బాబు, సీనియర్ నాయకులు సాయిబాబా, మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వేల్పుల రవి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, మైనారిటీ సెల్ సెక్రటరీ హనీఫ్, అమ్మిశెట్టి కిషోర్‌కుమార్, వాకా శేషుబాబు, కొక్కిలిగడ్డ సుమతి, చావలి సర్పంచ్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు దాది లక్ష్మణరావు, ఉక్కుర్తి నాగయ్య, శివారెడ్డి, గణపతిరావు, శరత్‌చంద్ర, రాజేంద్రప్రసాద్, వట్టిప్రోలు సునీత, గంటా రమాదేవి, గంటా స్వామి, గవిని లక్ష్మీదుర్గా, నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా, డీఏపీ

● టీడీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ

కొల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అందుబాటులో యూరియా, డీఏపీ ఎరువులు ఉన్నాయని, ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ అన్నారు. బుధవారం కొల్లూరు దక్షిణపు వీధిలో రైతు సేవా కేంద్రం-1 ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రంలో 220 బస్తాల యూరియా, 200 బస్తాల డీఏపీ, జీడీసీఎంఎస్‌లో 705 బస్తాల యూరియా రైతుల కోసం సిద్ధం చేయడం జరిగిందన్నారు. యూరియా కొరతపై కలెక్టర్‌తో మాట్లాడి రైతుల ఇబ్బందులు వివరించడం జరిగిందన్నారు. స్పందించిన కలెక్టర్ మూడు లారీల యూరియా కేవలం ఒక్క కొల్లూరుకే కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు యూరియాను రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఏవో నరేంద్రబాబు, వీఆర్వో రామారావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

కొల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తకు తాడిగిరిపాడు టీడీపీ నాయకులు తమవంతు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల కొల్లూరుకు చెందిన ఎస్సీ సెల్ నాయకుడు బుర్రి జగజ్జీవనరావు టాటాఎస్ వాహనాన్ని ముగ్గురు వ్యక్తులు కక్షపూరితంగా దగ్ధం చేశారు. వాహనం దగ్ధం కావడంతో రూ.5 లక్షలు నష్టపోయిన కార్యకర్తకు బుధవారం కొల్లూరులోని మైనేని మురళీకృష్ణ స్వగృహంలో మండల పరిధిలోని తాడిగిరిపాడుకు చెందిన టీడీపీ నాయకులు రూ.10,116ల నగదును సేకరించి మైనేని చేతుల మీదుగా బాధిత కార్యకర్తకు అందించారు. తొలుత ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కొల్లూరు, తాడిగిరిపాడుకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాట్లో సరిపడా ఎరువులు : ఏడీఏ

రేపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడా పూర్తి స్థాయిలో ఎరువులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మి అన్నారు. కైతేపల్లి, చాట్రగడ్డలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు, కౌలు రైతులు తప్పనిసరిగా పంటను ఈ నమోదు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో రైతులు ఎవరూ అధైర్యపడవద్దని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి యూరియా కొరత లేకుండా చేస్తారన్నారు. అరవపల్లి, కైతేపల్లి, పిరాట్లంకకు 20 మెట్రిక్ టన్నులు, చాట్రగడ్డ 20 మెట్రిక్ టన్నులు, మోళ్ళగుంట, మోర్లవారిపాలెం, పోటుమెరక తదితర గ్రామాలకు 20 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రైతులకు సరిపడా యూరియాను అందిస్తున్నామన్నారు. పీఏసీఎస్‌లలో యూరియాని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మహేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.


చావలిలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమం

వేమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చావలిలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రధానంగా ప్రతి కుటుంబంలో లింగ వివక్షతపై మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత జీవన నైపుణ్యాలు ఉన్నత విద్యను అధిరోహించడం స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన అవసరమని వాటిని గురించి వివరంగా తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, రాజ్యలక్ష్మి, పి.పద్మావతి, వై.పద్మజా, ఆదిశేషమ్మ, డి.పద్మావతి, నాంచారమ్మ, తల్లులు గ్రామంలోని మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెజీషియన్ శేఖర్‌కు బీవీ పట్టాభిరామ్ పురస్కారం

అమృతలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మెజీషియన్ ఆర్‌సీ శేఖర్‌కు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. బుధవారం హైదరాబాద్ నాపంల్లిలోని ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీలో తెలంగాణా రాష్ట్ర సైకాలజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బెస్ట్ మైథోలాజికల్ మెజీషియన్ 2025 తొలి అవార్డును శేఖర్‌కు అందజేశారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్య క్రమంలో మానసిక వికాసంతోపాటు, మూఢనమ్మకాలు నిర్మూలనకు శేఖర్ చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలం గాణా సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ సైకాల జిస్ట్ ఎంఏ కరీం తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ, ఉదయశ్రీ, ఆర్ చంద్రశేఖర్, ఎస్ శ్రీకాంత్, అనితాదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.30 కోట్ల పనులకు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ చెన్నకేశవులు, ఎంపీడీవో దీప్తి

చుండూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు గాను రూ.1.30 కోట్ల అంచనాలకు ఆమోదం తెలిపారు. ఎంపీపీ ధర్మరాజులు, చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ అభివృద్ధి పనుల గురించి రూ.10 అంశాలను ప్రతిపాదించగా సమావేశంలో అన్నింటిని ఆమోదించారు. వైసీపీకి చెందిన ఫణికుమార్ కొలకలూరు నిర్మాణంలో ఉన్న డ్రెయిన్స్ ఏ ప్రాతిపదికన చేపట్టారు అని ప్రశ్నించారు. సరైన అంచనాలు, టెస్టింగ్‌లు, నాణ్యతలు లేకుండా ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేయవద్దని కోరారు. వ్యవసాయ అధికారి సురేష్ మాట్లాడుతూ ఇప్పటికే 2500 మెట్రిక్ టన్నుల యూరియా మండల రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. రూ.70 లక్షలతో కాల్వల మరమ్మతులు, ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు, ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణ సమావేశంలో వివరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు కోడూరు స్వప్న, ఎంపీడీవో అత్తోట దీప్తి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడవల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీవో

చెరుకుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి బుధవారం చెరుకుపల్లి మండలంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియా నిల్వలకు సంబంధించిన స్టాకును పరిశీలించారు. గూడవల్లిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం, చెరుకుపల్లిలోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గూడవల్లి పీఏసీఎస్ దగ్గరకు వచ్చిన రైతులను యూరియా పంపిణీపై వివరాలు అడిగారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్రబాబు పంపిణీకి సంబంధించిన వివరాలు అడిగి రైతులందరికి యూరియా సక్రమంగా అందేటట్లు చూడాలన్నారు. రైతులందరికి సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, టోకెన్ సిస్టం ద్వారా రైతుల పాస్‌బుక్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరుగుతుందని ఆర్డీవో తెలిపారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదు

రేపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్‌లలో గర్భిణులకు లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌పై డివిజన్ పరిధిలోని స్కానింగ్‌సెంటర్‌ల వైద్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే స్కానింగ్ సెంటర్‌లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. టీనేజ్ బాలికలకు తన నడవడిక ఎలా ఉండాలో కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ మనోజ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ సముద్రాల రమేష్, డాక్టర్ రెబ్బాజాన్ ప్రసాద్, షేక్ షాహీన్, కె.రత్నరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అరుణ, మరియమ్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను సన్మానిస్తున్న వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెం అంజమ్మ తదితరులు

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా మల్లెం అంజమ్మ

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్‌గా మల్లెం అంజమ్మను నియమించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనను సత్కరించి సన్మానించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే అడుగుజాడల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు శివయ్య, జిల్లా అధ్యక్షుడు పల్లెపు వేణుబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు, చీరాల నాయకులు మల్లెం శివ గణేషబాబు, చల్లా శ్రీనివాసరావు,దేవల వెంకయ్య, తన్నీరు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావు



కుదరవల్లి వెంకటేశ్వరరావును అభినందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోడాయపాలేనికి చెందిన కుదరవల్లి వెంకటేశ్వరరావు రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మంత్రిసోదరుడు అనగాని శివప్రసాద్‌ను బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించేందుకు కృషి చేసిన రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రుణపడి ఉంటానన్నారు. సంఘీయుల సమస్యల కోసం పోరాడుతూ వారికి అండగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, రావిపాటి శ్రీధర్, తాడిపర్తి మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చుతున్న ఎస్ఎస్ఎఫ్

చెరుకుపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే విధంగా సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) పని చేస్తుందని జిల్లా సంస్కృతి ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. ఈనెల 20వ తేదీ విజయవాడలో ముఖ్యమంత్రితో జరుగు సమావేశానికి సన్నద్ధం చేసే సమావేశం గుళ్ళపల్లి నూకాలమ్మ దేవస్థానంలో బుధవారం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ ఆర్థిక నిధులతో ఎస్టీ, ఎస్సీ, మత్స్యకార వాడల్లో నిర్మాణం జరిగిన దేవాలయాల్లో అదే కులస్తులకు చెందిన అర్చకులకు టీటీడీ శిక్షణ ఇప్పించి వారే దేవాలయాలలో అర్చకత్వం నిర్వహించి దూపదీప నైవేద్యాలు చేసుకున్న సంగతి మనందరకు తెలుసునని, ఈ విషయం అంబేద్కర్ కోరుకున్నారని, ఆ విధంగానే ఈరోజు జరుగుతున్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, చింతల మురళీకృష్ణ, బాపట్ల జిల్లా దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను ఆనందబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న మురళీకృష్ణ, టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే ఆనందబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ శ్రేణులు

కొల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. కొల్లూరు నుంచి బుధవారం మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివెళ్లారు. ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం, దుశ్శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమాటి శ్యాంబాబు, పెదపూడి నాగరాజు, బుర్రి జగన్, యడ్ల శ్రీనివాస్, పోతార్లంక కుటుంబరావు, దావులూరి ఏడుకొండలు, జనసైనికులు ఈమని మణికంఠ, పవన్‌కుమార్, కమ్మెల వెంకటేష్ ఉన్నారు.

● కొల్లూరులో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ ఆవరణలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని మైనేని మురళీకృష్ణ, సర్పంచ్ రమావత్ విజయ మొక్కలు నాటి తమ ప్రియతమ నేతపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శంకరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కొల్లూరు, భట్టిప్రోలు మండల గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కొల్లూరు మండలం నుంచి మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, డీసీ చైర్మన్ యలవర్తి కోటేశ్వరరావు, సంగం డెయిరీ డైరెక్టర్, గుత్తికొండ జ్ఞానానంద భగవాన్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ల మహేష్, గళ్లా వెంకటతిరుపతయ్య, మేకా దివాకర్, కోగంటి హరిప్రసాద్, పార్టీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి), వేములపల్లి మోహనకృష్ణ, శిగిలిశెట్టి రాఘవరావు, భట్టిప్రోలు మండలం నుంచి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి రమేష్‌బాబు, జడ్పీటీసీ ఉదయభాస్కరి, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసరావు, డీసీ అధ్యక్షుడు కర్ర శ్రీనివాసరావు, వాకా పాపారావు, వేములపల్లి జగన్నాధరావు, వాకా శ్రీనివాసరావు, తిరువీధుల బాలాజీ, కుక్కల వెంకటేశ్వరరావు, అనగాని ఏడుకొండలు, రాజులపాటి వెంకటేశ్వరరావు, రాయన ప్రసాద్ పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● వేమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని చదలవాడ గ్రామంలో బుధవారం వరహాపురం సొసైటీ అధ్యక్షుడు బొల్లిముంత నాగకుమార్ గ్రామంలో మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటేశ్వరరావు, రమేష్, బ్రహ్మయ్య, దాసు, పవన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మె ల్యే నక్కా ఆనందబాబు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో కేక్ కట్ చేసి మిఠా యిలు పంపిణీ చేశారు. పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కార్య కర్తలు, నాయకులు గుంటూరులోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి పూలమాల లు, శాలువాలతో సత్కరించి ఆనందబాబుకు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.

వేమూరు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ దంపతులు గొట్టిపాటి పూర్ణకుమారి, గంగాధర్‌లు, పార్టీ మండల అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, పెదపూడి, కూచిపూడి, ఇంటూరు పీఏసీఎస్ చైర్మన్‌లు కొసరాజు దేవకుమార్, తుమ్మల భుజంగరావు, కాట్రగడ్డ లక్ష్మీప్రసాద్‌లు స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. ఇంటూరులో ఎన్నారై కర్లపూడిబాబు ఆర్థిక సాయంతో 350 మందికి దుప్పట్లను ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి పంపిణీ చేశా రు. గోవాడలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

ప్రభుత్వ వైద్యకళాశాల ప్రైవేటీకరణ సరికాదు : బీఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణాన్ని ప్రైవేటు పరం చేయడం సరికాదని బహుజనసమాజ్‌పార్టీ జిల్లాఅధ్యక్షుడు రాజారావు పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం మండలపరిషత్ కార్యాలయ రోడ్డులో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ చేస్తే ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో నల్లమోతు శామ్యూల్ జాన్సన్, కొమ్మతోటి కిరణ్, తమలపాకుల భాస్కరరావు, ఆదాం, కరీముల్లా, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టించవద్దు : ఏవో

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కృత్రిమ కొరతను సృష్టించవద్దు అని మండల వ్యవసాయ శాఖాధికారి సీహెచ్ సత్యానంద్ బుధవారం తెలిపారు. 70టన్నుల యూరియా వచ్చిందని రైతులు కావాల్సినంత మేరకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. మండల విస్తరణాధికారి సీహెచ్ సుదర్శనరావు, వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది యూరియా పంపిణీ చేశారు.

అవీ..ఇవీ..

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వారం

● జయప్రదం చేయాలని ఆ సంఘం నేతలు పిలుపు

పంగులూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్) జిల్లా ఉపాధ్యక్షులు చేజర్ల చెంచురామారావు, కంకణాల శ్రీనివాసరావు బుధవారం సంయుక్త ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులందరు ఐక్యంగా ఈ నిరసన వారాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. నిరసన వారంలో భాగంగా గురువారం ఉపాధ్యాయులందరూ నల్లబాడ్జీలు ధరించి హాజరుకావాలని ఆ సంఘం మండలశాఖ అధ్యక్ష,కార్యదర్శులు తన్నీరు వెంకటరావు, షేక్ రహంతుల్లాలు విజ్ఞప్తిచేశారు.

నేడు గ్రోమోర్‌లో యూరియా పంపిణీ

మార్టూరు, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని గ్రోమోర్ సెంటర్‌లో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేస్తారని ఏవో ఆర్ లావణ్య బుధవారం తెలిపారు. ఆమె బుధవారం మండలంలోని కోనంకి, వలపర్ల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కలిగించారు. అంతేగాకుండా నానో యూరియా వినియోగం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అయితే గురువారం గ్రోమోర్ కార్యాలయం వద్ద ఈ-పంటను నమోదుచేసుకున్న రైతులకు అవసరమైన వారికి ఎకరాకు ఒక బస్తా యూరియాను పంపిణీ చేస్తామన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు సుస్థిర జీవనోపాధి

● మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ ఆనంద్ సత్యపాల్

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళలకు సుస్థిరమైన జీవనోపాధి పెంపొందించే విధంగా సిబ్బంది కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ ఆనంద్ సత్యపాల్ అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీడీ బుధవారం చీరాల మెప్మా కార్యాలయంలో మేనేజర్ కొండయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంపిక చేసిన 220 మంది మహిళ లబ్దిదారులతో యూనిట్లు ఏర్పాటు చేయించాలన్నారు. అలాగే డిజిటల్ సేవల ఏర్పాటు కోసం డిజీలక్ష్మీలతో కియోస్క్ సెంటర్లు నిర్వహించాలని చెప్పారు. సూర్యఘర్, ర్యాపిడో ఆటోలు, బైక్‌ల రుణాలకు సంబంధించి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీవోలు రత్నకుమారి, సుబ్బారావు, శేషారత్నం, సతీష్, డీఈవో అనీల్, ఆర్పీలు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో విద్యార్థులకు ఆరోగ్యం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు ఐ.బాబురావు పేర్కొన్నారు. బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది విద్యార్థులకు దంత పరీక్షలు, గుండె తదితర పరీక్షలు నిర్వహించారు. అలాగే రూ.15 వేలు విలువైన బ్రష్‌లు, పేస్టు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.రవితేజ్, అబ్రహాం, బ్లెస్సీ, ప్రత్యూష, మేఘసాయి పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సాల్మన్, క్లబ్ ప్రతినిధులు కృష్ణమూర్తి, రామకృష్ణ, సురేష్, వెంకటేశ్వరరావు, శివాంజనేయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి తాటి చెట్లు దగ్ధం

చినగంజాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో చినగంజాం మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుపల్లెపాలెం గ్రామానికి సమీపంలోని కొక్కిలిగడ్డ రాజారావుకు చెందిన పొలంలోని తాటి చెట్లపై పిడుగు పడింది. దీంతో పొలంలోని పది తాటి చెట్లు దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. భారీ వర్షంతో పలు గ్రామాల్లోని రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కడవకుదురు గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారిపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు బయటకు మార్గం లేక నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని పాదచారులు, వాహనాదారులు అంటున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చినగంజాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన నంబూరి శివమ్మ(65) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. సోపిరాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తుమ్మలపెంట శ్రీనివాసరావు బుధవారం శివమ్మ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు శివమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

న్యాయవాదులపై అక్రమ కేసులు అన్యాయం



విధులను బహిష్కరించి నిరసన చేపట్టిన న్యాయవాదులు

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులపై అక్రమ కేసులు అన్యాయమని, నిరంతరం బాధితుల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారం కోసం న్యాయవాదులు పోరాడతారని చీరాల న్యాయవాదులు పేర్కొన్నారు. ఇటీవల రాజకీయ నేత గుంటూరు మాధవరావుపై న్యాయవాది ఆకుల కొండయ్య దాడిచేసినట్లు జె.పంగులూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి నిరసనగా బుధవారం పలువురున్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఉద్దేశ్య పూర్వకంగా కేసులు మోపి అభాసు పాలు చేయడం తగదన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

27న కూచిపూడి, భరతనాట్యం పోటీలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న స్థానిక శింగరకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో బాలికలకు కూచిపూడి, భరతనాట్యం పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కూకట్ల సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుండి 6 సంవత్సరాల వారిని ఒక గ్రూపుగా, వారికి ప్రోత్సాహక బహుమతులు, వయస్సుల వారిగా మరో నాలుగు గ్రూపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.4వేలు, రూ.3 వేలు, రూ.2వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు ఒకొక్కరికి రూ.300 చెల్లించి ఈ నెల 26వ తేదిలోపు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత ప్రదర్శన మాత్రమనే నని, సినిమా పాఠశాలకు అనుమతి లేదన్నారు. పూర్తి వివరాలకు 94409 74064 నంబరును సంప్రదించాలన్నారు.









పెద్ద అండరుపాస్ వద్ద ఏర్పడిన పెద్ద గుంత, సర్వీసురోడ్డు మలుపులో నిలిచిన నీరు, దుకాణాల వారు పగులగొట్టిన సర్వీసురోడ్డు, వంతెన మలుపులో ప్రమాదభరితంగా ఉన్న గుంతలో నిలిచిన నీరు

మార్టూరు కూడలిలో రోడ్లపై గుంతలు

- రోడ్డుపై నిలుస్తున్న మురుగునీరు
- వాహనదారులకు కనిపించని ప్రమాదాలు
- సర్వీసురోడ్డును ధ్వంసం చేసి డ్రైనేజీ లైన్లు
- పట్టించుకోని హైవే అధికారులు

మార్టూరు, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి):చెన్నై టూ కోల్‌కత్తా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మార్టూరు సెంటర్లోని జాతీయరహదారిని విస్తరించారు. ఫ్లైఓవర్ కూడా నిర్మించడంతో వాహనచోదకుల అవస్థలు తప్పాయనడంతో అతిశయోక్తి కాదు. అయితే నిర్వహణ లేమితో పలు సమస్యలు వాహనదారుల భద్రతను ప్రమాదంలోనికి నెడుతున్నాయి.

మార్టూరులో పెద్ద ఖానా వద్ద గోతులు ఏర్పడ్డాయి. అంతేగాకుండా .ఈ గుంతలు కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఒక మోస్తరు వర్షం కురిసినా పెద్ద ఖానా వద్ద నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఈ నీటిలో ఎక్క గుంత ఉందో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ నీటిలో వాహనాలు నడిపి ఒక్కసారిగా గోతుల్లో పడి ప్రమాదాలబారిన పడ్డ ఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా స్కూటీలపై వెళ్లే, మహిళలు, విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఇక పాదచారులైతే వర్షం కురిసినప్పుడు నడిచివెళ్లే పరిస్థితి కూడా లేదు. విద్యానగర్ ముందు జాతీయ రహదారిపై వర్షం కురిసినప్పుడు పెద్దపెద్ద నీటిమడుగులు ఎర్పడుతున్నాయి. అక్కడ మురుగునీరు వెళ్లే దారిలేదు, వర్షం కురిస్తే వాననీరు రోడ్లపైనే భారీగా నిలుస్తోంది. హైవే అధికారులు వాటిని గురించి పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

సర్వీసురోడ్లు పగలగొడుతున్నారు

మార్టూరు సెంటర్లో ఫ్లైఓవర్‌కు తూర్పు వైపున హైవే అధికారులుగాని, గ్రామ పంచాయతీ వారు గాని సైడు కాల్వలు నిర్మించలేదు. దీంతో తూర్పువైపున దుకాణాలు వారు, ఇంటి యజమానులు వారి దగ్గర నుండి వచ్చే మురుగునీరు, వృధానీటిని బయటకు పంపడానికి సర్వీసురోడ్డును పగలగొట్టి ఫ్లైఓవర్ గోడవైపు మళ్లించారు. ఇక ఫ్లైఓవర్‌కు పడమర వైపు ఉన్న చికెన్ దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు కూడా సర్వీసురోడుడ పగొలగొట్టి ఫ్లైఓవర్ గోడ వెంబడి ఉన్న డ్రైనేజీలోనికి నీటిని పంపుతున్నారు. దీని కోసం నేరుగా రోడ్డుకు గాడి కొడుతుండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

రోడ్డుపై నిలుస్తున్న వర్షపునీరు

హీరోషోరూం ఎదురుగా సర్వీసు రోడ్డు నుంచి హైవే పైకి వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద భారీగా మురుగునీరు నిలుస్తోంది. ఈ నీరు నిలిచిన స్థానంలో భారీగా గోతులు కూడా ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే వాహనదారులు రోడ్డు క్రాస్ చేసే సమయంలో ఈ గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఒక సారి హైవే అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసినా, సమస్యకు పరిష్కారం చూపలేదు. అయితే ఈ మలుపు వద్ద ఒంగోలు వైపు వెళ్లే ప్రయాణికులు బస్సులు కోసం వేచి ఉంటారు. వివిధ వాహనాలు అటువైపు వెళ్లే క్రమంలో మురుగునీరు చిమ్మి వారిపై పడుతోంది.

రోడ్లపై మరమ్మతులు చేస్తాం

గతంలో ఒక సారి రోడ్లపై మరమ్మత్తులు చేశాం. మరల పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి గుంతలను పూడ్చివేస్తాం. రోడ్లపై మురుగునీరు నిలబడకుండా చర్యలు చేపడతాం.

బ్రహ్మారెడ్డి హైవే అధికారి

కనకయ్య సేవలు చిరస్మరణీయం



కనకయ్య స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్

పర్చూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పౌరహక్కుల నేత క్రిష్ణంశెట్టి కనకయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్ అన్నారు. కనకయ్య 10వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక బాలికల పాఠశాలలో రాష్ట్ర కళాకారులు కారుమూరి సీతారామయ్య అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరిప్రసాద్ మాట్లాడుతూ బాలికల విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న సంకల్పంతో పర్చూరులో పాఠశాలను ఏర్పాటు చేసి దాతలు, కుటుంబ సభ్యుల సహకారంతో 30 ఏళ్లగా నిర్వహించడం ఆయన సేవకు నిదర్శనం అన్నారు. క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పౌరహక్కుల నేతగా, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన తీరు చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో క్రిష్ణంశెట్టి అజయ్‌బాబు, కోటి క్రాంతి శ్రీనివాస్, ఆరాధ్యుల శాంతి, వెంకటేశ్వరరావు, కాసా అశోక్‌కుమార్, క్రిష్ణంశెట్టి బసవరాజు, క్రిష్ణంశెట్టి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

● నిర్మాణాలను పరిశీలించిన మహేంద్రనాథ్



తీరంలో పర్యటిస్తున్న మహేంద్రనాథ్

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో తీరానికి వచ్చే పర్యాటకుల సౌకర్యాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో గతకొద్ది రోజులుగా రామాపురం, వాడరేవు తీర ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు, వెయిటింగ్ హాల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పనులను పరిశీలించారు. పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణాలు వేగవంతంగా జరగాలని చెప్పారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నక్కల నాగరాజు, తదితరులు ఉన్నారు.

పర్చూరులో భారీ వర్షం

జలమయమైన రహదారులు

లోతట్టు నివాసాల్లోకి వర్షపు నీరు

పర్చూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో బుధవారం కురిసిన భారీ వర్షానికి రహదారులు జమమయం అయ్యాయి. రోడ్లపై పెద్ద ఎత్తున నీరు చేరటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పర్చూరులో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, కాలవలపై కట్టడాలు నిర్మించు కోవడంతో నీరు ముందుకు కదలని విధంగా తయారైంది. ఎక్కడ చూసినా డ్రైనేజ్ కాలువ లను యద్ధేచ్ఛగా ఆక్రమించుకొని వ్యాపార దుకాణాలను కొనసాగిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకో వచ్చు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపు నీటితో మరు గునీరు కలసి రోడ్లపై చేరు తుంది. భారీ వర్షం కురిసిన ప్పుడు నివాసాల్లోకి నీరు చేరా ల్సిందే అన్నవిధంగా పరిస్థితి నెలకొంది. పర్చూరు - చీరాల రోడ్డుతోపాటు, కొట్లబజారు పరిస్థితి మరింత దయనీయం గా మారింది. బుధవారం కురిసిన భారీ వర్షంతో రోడ్లు వాగులను తలపించే విధంగా మారాయి.



బురదమయమైన పర్చూరు - చీరాల రోడ్డు



పర్చూరు కొట్లబజారులో నివాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు

డిగ్రీ విద్యార్థులతో రోటరాక్టు క్లబ్ ఏర్పాటు



రోటరాక్టు క్లబ్ సభ్యులతో రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో బుధవారం 20 మంది డిగ్రీ విద్యార్థులతో రొటరాక్టు క్లబ్‌ను ఏర్పాటు చేశారు. రొటరాక్టు క్లబ్ అధ్యక్షుడిగా తన్నీరు రాకేష్, సెక్రటరీగా తిరునగరు హేమంత్‌లను నియమించారు. రోటరీ క్లబ్ సమాజ సేవలలో ఏవిధంగా ఉపయోగపడుతుందో అదేవిధంగా రొటారాక్టు క్లబ్ కూడా రోటరీ క్లబ్‌తో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి అలహరి హరిప్రసాద్ కళాశాల ప్రిన్సిపాల్ పోపూరి ఎల్‌వీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకికి అధునాతన బస్టాండ్



ఎక్కువ ఆదాయం తీసుకు వచ్చిన కండక్టర్‌ను అభినందిస్తున్న ఎండీ

ఆర్‌టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

అద్దంకి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న రెండుమూడేళ్లలో అద్దంకిలో అధునాతన బస్టాండ్ నిర్మించనున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు అన్నారు. అద్దంకిలోని ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీలను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ముందుగా బస్టాండ్ ప్రాంగణంలో మొక్కను నాటారు. కార్మికులతో మాట్లాడి, పలు విభాగాలలో ఉత్తమ కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దంకిలో ప్రస్తుతం ఉన్న దుకాణాల వలన మంచి ఆదాయం వస్తోందన్నారు. విశాలమైన స్థలం ఉన్నందున ముందు వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వెనుక వైపు ఆధునాతన వసతులతో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఆర్టీసీ ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. స్త్రీశక్తి పథకం అమలులో పక్కరాష్ట్రంలో వివిధ సమస్యలు ఉత్పన్నం కాగా, మనరాష్ట్రంలో విజయవంతమైందన్నారు. గతంలో ఆర్టీసీ బస్సులలో 40 శాతం మంది మహిళలు ప్రయాణిస్తుండగా ప్రస్తుతం 65 శాతానికి చేరినట్లు తెలిపారు. మరిన్ని బస్సులలో మహిళాశక్తి పథకం అమలుచేసేలా సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోనున్నారన్నారు. ప్రయాణికులు సంఖ్య పెరిగినందున అన్ని బస్టాండ్ లలో వసతులు పెంచుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 2550 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకే ఉన్న బస్సులనే ఎక్కువ ట్రిప్పులు తిప్పేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. బస్సుల మెయింటినెన్స్ కూడా పెంచుతున్నామన్నారు. వ్యయం తగ్గించడంతో పాటు నాన్‌టికెట్ ఆదాయం పెంచేందుకు కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందుతుందన్నారు. ఇప్పటికే మెరుగైన వైద్య వసతులు కల్పించి 1200 మంది కార్మికుల ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగి బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఆయిల్ ఎక్కువ ఖర్చు అవుతుందని అద్దె బస్సుల యజమానులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఎండీ ద్వారకాతిరుమలరావును సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఈడీ (ఆపరేషన్స్) అప్పలరాజు, నెల్లూరు ఈడీ నాగేంద్ర ప్రసాద్, డీపీటీవో సామ్రాజ్యం, సీటీఎం రవికాంత్, డీఎం బెల్లం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి తదితరులు పాల్గొన్నారు.

అనిత సేవలు ఉపాధ్యాయులకు ఆదర్శం

● డిప్యూటీ డీఈవో గంగాధర్



అనితకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

పంగులూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సేవాభావంతో పనిచేస్తూ, ఉత్తమ బోదనతో పాఠశాల విద్యార్థుల భవితను తీర్చిదిద్దుతున్న హెచ్‌ఎం అనిత సేవలు ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని చీరాల డిప్యూటీ డీఈవో గంగాధర్ అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన కొండమంజులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనిత అభినందన సభ బుధవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూటుతున్నారన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అనితను గంగాధర్‌తో పాటు ఎంఈవోలు నాగభూషణం, వీరాంజనేయులు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు చింతల సహదేవుడు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రామగోపాలరెడ్డి, ఆరె శ్రీనివాసరావు, పలువురు గ్రామస్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత అభినందనీయం

టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య

చినగంజాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మీలు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు మార్పు విశ్రాంతమ్మ అధ్యక్షతన బుధవారం దివ్యాంగులు, పీ4 లబ్దిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దాత సోపిరాల గ్రామానికి చెందిన టీఎస్‌టీయూసీ పర్చూరు నియోజక వర్గ అధ్యక్షులు నరహరి శ్రీనివాసరావు రూ.25 వేల విలువైన నిత్యావసర సరుకులను 40 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. పీ4 కింద 22 మందిని గుర్తించి, మిగిలిన 18 మందిని దివ్యాంగుల గ్రూపులో వారిని కలిపి 40 మందికి నిత్యావస రాలను అందజేసినట్లు ఏపీఎం గద్దె పెద సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసునారాయణ, పర్వతరెడ్డి పార్థసారిధి, గంటా వెంకటనారాయణ, షేక్ హుస్సేన్‌భాష, తొగరు దుర్గారావు, పీ.లక్ష్మీనారాయణ, గుండ్రెడ్డి నరసింహారావు, షేక్.ఖాదర్‌భాష, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్‌టీ తగ్గింపుపై హర్షం

● బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

పర్చూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జీఎస్టీ విధానాన్ని హర్షిస్తూ బీజేపీ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో బుధవారం పర్చూరు బొమ్మల కూడలిలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు పన్నుభారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సూచనల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు కొండముది బంగారుబాబు, అమీన్ బాషా, అడపాల కృష్ణ, మద్రిపూడి శ్రీనివాసరావు, రంగబాబు, శ్రీనివాసరావు, స్థానిక మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశీలన ప్రహసనం

(5వ పేజీ తరువాయి)

ఈడబ్ల్యూఎస్‌కి ఎలా అర్హత పొందుతారనే సమస్య వచ్చింది. దీంతో ఐటీ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారంతో అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసిన వారు దాదాపు 100 మందికి పైగా ఉన్నారు. వీరు ఈడబ్ల్యూఎస్‌కు అర్హులా కాదా అనే తేల్చే పని అధికారులకు కత్తి మీదసాములా మారింది.

నాలుగైదు దఫాలుగా..

దివ్యాంగుల విషయానికి వస్తే కొన్ని సమస్యలు కొలిక్కిరాలేదు. ప్రధానంగా వినికిడి సమస్యతో సర్టిఫికెట్లు పొందిన వారు వాటిని నిర్ధారించుకోలేక పోతున్నారు. దీంతో వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు మళ్లీ పిలవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన ఇప్పటికే నాలుగైదు దఫాలుగా నిర్వహించారు. అయినా ఇంకా మరో పది మంది సర్టిఫికెట్లను నిర్ధారించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించుకుంటూ నిర్దేశించిన నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు.

సున్నా వడ్డీ కలేనా?

(5వ పేజీ తరువాయి)

ఇస్తానని చెప్పింది. కానీ, పథకాన్ని 15 నెలలు ఆలస్యంగా ప్రారంభించి కాల హరణం చేసింది. రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న, మూడో విడత రుణ మాఫీని ఆరు నెలల ఆలస్యంగా 2023 మార్చి 25న ప్రారంభించారు. 2024 ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకూ నాలుగో విడత ఆసరాని ఆపేసి మూడు జిల్లాల్లోని డ్వాక్రా మహిళలకు రూ.699 కోట్లు ఎగవేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్ డీఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో విభజిత గుంటూరు జిల్లాలో 29,322 డ్వాక్రా సంఘాలకు చెందిన 2.86 లక్షల మందికి రూ.246 కోట్లు, పల్నాడు జిల్లాలో 25,168 గ్రూపుల్లో 2,47,833 మందికి ఆసరా కింద రూ. రూ.190 కోట్లు, బాపట్ల జిల్లాలో 30,604 గ్రూపులకు గాను.. మూడు లక్షల మం దికి రూ. 263 కోట్లు ఆసరా పథకం కింద నాలుగో విడత రుణమాఫీ జరగాల్సి ఉంది. దాన్ని గత ప్రభుత్వం ఎగవేయడం తో ఆ భారాన్ని మహిళలే మోయాల్సి వస్తోంది. దీనికి తోడు గడిచిన 15 నెలల వడ్డీ కూడా వారిపై పడడంతో స్వయం సహాయక సంఘాల మహిళల కు అనాసక్తికి గురవుతున్నారు.